క్లుప్తంగా

'కోడూరి' సాహిత్య సేవలు మరువలేనివి

సీటీఆర్ఐ: తెలుగు సాహిత్యానికి కోడూరి శ్రీరామమూర్తి చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు, గాంధేయవాది కోడూరి శ్రీరామమూర్తి ఈ నెల 5వ తేదీన కన్నుమూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన సాహిత్య కృషికి నివాళులర్పిస్తూ గౌతమీ ప్రాంతీయ గ్రంథాలయంలో సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కార గ్రహీత డాక్టర్ అరిపిరాల నారాయణరావు, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రెంటాల శ్రీ వేంకటేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ కూర్మయ్య తదితరులు ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

13న వాలీబాల్ ఎంపికలు

ప్రకాశం నగర్: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఈ నెల 13న ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలోని పరిమి రామచంద్రరావు మెమోరియల్ ఫ్లడ్‌లైట్ వాలీబాల్ కోర్టులో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కె.యశ్వంత్ సోమవారం ప్రకటనలో తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాప్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. 22 ఏళ్లలోపు బాలబాలికలు ఈ ఎంపికలకు అర్హులని చెప్పారు. ఆసక్తి కల క్రీడాకారులు ఆరోజు ఉదయం తొమ్మిది గంటలకు మైదానంలో రిపోర్టు చేయాలన్నారు.

అర్జీదారుల సంతృప్తి ప్రధానం



అర్జీ స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ వెంకట రమణ

రాజమహేంద్రవరం సిటీ: అర్జీదారుడు సంతృప్తి చెందేలా పీజీఆర్ఎస్‌కు వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలని నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ అన్నారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో 30 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో సెక్రటరీ జి.శైలజావల్లి, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఈ(ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

నూతన హజ్ కమిటీ వేయాలి




ధవళేశ్వరం: సెంట్రల్ గవర్నమెంట్ జీవోకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం నియమించిన హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా వెంటనే రాజీనామా చేయాలని జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ కరీం బాషా (షబ్బర్ బాషా) డిమాండ్ చేశారు. పవిత్రమైన హజ్ కమిటీలో ధార్మిక పండితులు మెంబర్లుగా ఉండాల్సిన స్థానంలో టీడీపీ కార్యకర్తలను నియమించిన కూటమి ప్రభుత్వం.. రాష్ట్రంలో ఉన్న ధార్మిక పండితులను చిన్న చూపు చూడడం సరి అయిన పద్ధతి కాదన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ జీవోకు విరుద్ధంగా ఏర్పడిన ఈ హజ్ కమిటీని కూటమి ప్రభుత్వం రద్దు చేసి, ధార్మిక పండితులతో కూడిన కొత్త హజ్ కమిటీ ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ వెంకటేశ్వర నగర్, స్వరూప నగర్, విద్యుత్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, చెరుకూరి ఫంక్షన్ హాల్ రోడ్డు, గోలి రామారావు వీధి, వాకర్స్ పార్క్ రోడ్డు, సత్యవతి హోటల్ రోడ్డు, మహాలక్ష్మి టెంపుల్ స్ట్రీట్స్, కోదండ రామాలయం టెంపుల్ ఏరియా, వాకర్స్ రోడ్, జేఎన్ రోడ్, సుక్షేత్ర అపార్ట్‌మెంట్స్ ఏరియా, ఏవీ అప్పారావు రోడ్, శ్రీనివాస నగర్, కోకా భాస్కర్ నగర్, జయశ్రీ గార్డెన్స్ ఐదు వీధులు, పిల్లివారి వీధి, మంతెన గార్డెన్స్, షిర్డీ సాయి మార్గ్, తోటరాములు నగర్, శారదా నగర్, విద్యుత్ కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

టీడీపీ నేతల మారణకాండ



విజయ సారథి

రాజమహేంద్రవరం రూరల్: పులివెందులలో జరుగుతున్న జెడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ నేతలు మారణకాండ సృష్టిస్తోంటే ఎన్నికల కమిషన్ ఏం చేస్తోందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ సారథి అన్నారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో మాట్లాడారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి నేతలు చేస్తున్న కుట్రలకు పోలీసులు వంత పాడటం దారుణమన్నారు. ఇంత జరుగుతున్నా ఎన్నికల కమిషన్ స్పందించకపోవడమేమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెడ్ బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తూ ఎస్సీ, బీసీ ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కాకుండానే రూ.లక్షల కోట్లు అప్పులు చేసిందని, ఏ సంక్షేమ పథకాన్ని కూడా ప్రజలందరికీ అందించలేని స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు.

సమైక్యతను చాటేలా 'హర్ ఘర్ తిరంగా'

- ప్రతి ఇంటిపైనా జాతీయ పతాకం ఎగురవేయాలి
- కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు



దండి మార్చ్ విగ్రహాల వద్ద జాతీయ జెండాలతో పాఠశాల విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: జాతీయ సమైక్యతను చాటి చెప్పేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి తెలిపారు. హర్ ఘర్ తిరంగా ప్రచారంలో భాగంగా సోమవారం వై.జంక్షన్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ ఆర్ఎంసీ అధికారులు, ఉద్యోగులు, సచివాలయ కార్యదర్శులతో మెగా ర్యాలీ నిర్వహించారు. తొలుత ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ సమైక్యతను, సమగ్రతను కాపాడటం దేశ పౌరులుగా మనందరి బాధ్యత అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగమైన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. ఇందులో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. నగర పౌరులు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. హర్ ఘర్ తిరంగా సెల్ఫీ బూత్ లను ఏర్పాటు చేయడం, అధికారులు, ప్రజలు ఫోటోలను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, డిప్యూటీ డైరెక్టర్ రామారావు, సిటీ ప్లానర్ జి.కోటయ్య, ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ వినూత్న, రెవెన్యూ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరావు, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్, సీఎంఎం రామలక్ష్మి, ఈఈలు మాధవి, మదర్సా అలీ, ఏడీహెచ్ స్వాతి పాల్గొన్నారు.

దేశభక్తిని ప్రేరేపించేలా..

సీటీఆర్ఐ: దేశభక్తిని ప్రతి పౌరుడిలో ప్రేరేపించేలా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఆగస్టు 14 వరకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంతి అన్నారు. దీనిపై కలెక్టరేట్‌లో అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి గ్రామ, వార్డు సచివాలయ స్థాయి వరకు పలు చైతన్య కార్యక్రమాలు, ర్యాలీలు, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- విజయ శంకర ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సంగీత, నృత్య పాఠశాల నుంచి దండి మార్చ్ వరకూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలకు పాతర



కానుబోయిన సాగర్

రాజమహేంద్రవరం సిటీ: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలలో ప్రజాస్వామ్య పద్ధతులు కనిపించడం లేదని, ఎన్నికల కమిషన్ సైతం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ మాజీ స్టేట్ డైరెక్టర్ కాను బోయిన సాగర్ అన్నారు. పులివెందులలో ఉపఎన్నికను తీరుతెన్నులు పరిశీలించేందుకు వెళ్లి తిరిగి వచ్చి అనంతరం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికను కూటమి నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్నారు. ఒక ఊరిలో వేయాల్సిన ఓట్లను సుమారు నాలుగైదు కిలోమీటర్ల వెళ్లి వేయాల్సిన దుస్థితి ఓటర్లకు ఏర్పడిందన్నారు. బీహార్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలు, చట్టాలే పని చేయవనే నానుడు ఉందని, అటువంటి పరిస్థితి మన రాష్ట్రంలో కనిపిస్తోందన్నారు.

చవితి ఉత్సవాలకు సింగిల్ విండో అనుమతులు



ప్రశాంతి, జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీలకు సింగిల్ విండో విధానం ద్వారా అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి సోమవారం ప్రకటించారు. ఈ మేరకు సోమవారం పోలీసు, రెవెన్యూ, ఫైర్, ఏపీఈపీడీసీఎల్, ఫిషరీస్, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెండో అంతస్తులో ఉన్న పట్టణ ప్రణాళికా విభాగంలో ఈ నెల 21 నుంచి 26 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా గణపతి ఉత్సవ కమిటీ సభ్యులకు ఈ కింద సూచనలు చేశారు.

- మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి. కూడళ్లు, ముఖ్యమైన రోడ్లలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా మంటపాలు ఏర్పాటు చేయరాదు.
- భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో పందిళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి.
- మంటపాల్లో మండే స్వభావం గల వస్తువులు ఉంచరాదు. ఉత్సవాల నిర్వహించే సమయంలో బాణసంచా కాల్చరాదు.
- గణపతి ఉత్సవాల నిర్వహణలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు ఏ విధమైన నష్టం కలిగించరాదు. రోడ్లు, నీటి సరఫరా పైపులు, విద్యుత్ తీగలకు నష్టం వాటిల్లితే , వాటికి అయ్యే ఖర్చును కమిటీ నుంచి వసూలు చేస్తారు.
- గణపతి పందిళ్లలో ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే తక్కువ శబ్దంతో ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా లౌడ్ స్పీకర్ వినియోగించాలి
- విద్యాసంస్థలు, ఆసుపత్రుల పరిసర ప్రాంతాలలో గణపతి ఉత్సవాలు నిర్వహించుటకు అనుమతి జారీ చేయబడవు.
- గణపతి నిమజ్జనం జరిగే దీ, సమయం, రూటు వివరాలు కమిటీ సభ్యులు సంబంధిత డిపార్టుమెంటు వారికి ముందుగా తెలియజేయాలి.
- పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా, పూత, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఇతర రసాయన పదార్థాలతో తయారు చేసిన విగ్రహాల వినియోగం పూర్తిగా నిషేధించడమైనది. మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, తగిన నియమ నిబంధనల ప్రకారం సంబంధిత ఉత్సవ కమిటీలకు మాత్రమే అనుమతులు జారీ చేయబడును.

గోదావరి తీరంలో వేద నాదం

- ఈ నెల 16 నుంచి సభలు
- హాజరుకానున్న ప్రముఖులు

సీటీఆర్ఐ: గోదావరి తీరం వేద నాదంతో మారుమోగనుంది. శ్రావణమాసం సందర్భంగా నగరంలోని వివిధ సంస్థలు వేద సభలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ఈ నెల 16వ తేదీన అనేక చోట్ల వేద సభలు నిర్వహించనున్నారు. వాటికి సంబంధించిన ప్రకటనను సభ నిర్వాహకులు సోమవారం విడుదల చేశారు.

వేదశాస్త్ర పరిషత్తు ఆధ్వర్యంలో..

నగరంలో అతి పురాతనమైన వేదశాస్త్ర పరిషత్తు ఈ నెల 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు త్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో వేద సభ నిర్వహించనుంది. ఈ కార్యక్రమానికి మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ అధ్యక్షత వహిస్తారు. పరిషత్తు నిర్వహించే వేదశాస్త్ర పరీక్షలలో ఉత్తీర్ణులకు పట్టాల పంపిణీ జరుగుతుంది. స్వాధ్యాయరత్న గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠీకి కంచికామకోటి పీఠాధిపతి చేతుల మీదుగా బిరుదు ప్రదానం చేస్తారు.

- 16వ తేదీ ఉదయం 8 గంటలకు ఇన్నీసుపేటలోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో వేదస్వస్తి జరుగుతుంది. అనంతరం వేదవిద్యార్థులతో మార్కండేయేశ్వరస్వామి ఆలయం వరకూ ఊరేగింపు నిర్వహిస్తారు. అనంతరం మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో వేదస్వస్తి జరుగుతుంది. కార్యక్రమాల్లో భాగంగా 15వ తేదీ సాయంత్రం 6 గంటలకు సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ ''శ్రీకృష్ణ శ్శరణం మమ'' అనే అంశంపై ప్రసంగిస్తారు.
- కొంపెల్ల సుబ్బరాయ శాస్త్రి వేద శాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో దశమ వార్షికోత్సవ వేదసభ ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి ప్రాంగణంలో జరుగనుంది. మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ అధ్యక్షత వహించే ఈ కార్యక్రమంలో వేద సమ్రాట్ కడియాల సీతారామ ఘనపాఠి, స్వాధ్యాయరత్న గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠీ ఆధ్వర్యంలో వేదస్వస్తి జరుగుతుంది. సాధకోత్తమ డాక్టర్ ఓరుగంటి గురుప్రసాద లక్ష్మీనారాయణ, సాంగవేద భాష్యరత్న దువ్వూరి ఫణి యజ్ఞేశ్వర సోమయాజులు, ప్రవచననిధి డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ తదితర వేదపండితులు పాల్గొంటారు. పరిషత్తు అధ్యక్షుడు కొంపెల్ల సూర్యనారాయణ, కార్యదర్శి కొంపెల్ల సత్యనారాయణల నిర్వహణలో కార్యక్రమాలు జరుగనున్నాయి.
- విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి వేదశాస్త్ర పరిషత్తు ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6 గంటలకు గోదావరి గట్టున గల మల్లిగ సత్రంలో వార్షిక వేదసభ జరుగుతుందని నిర్వాహకుడు, రాష్ట్రపతి పురస్కార గ్రహీత విశ్వనాథ గోపాలకృష్ణ తెలిపారు.
- 16వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు కళాగౌతమి ఆధ్వర్యంలో సరస్వతీ ఘాట్‌లోని జ్ఞాన సరస్వతి పీఠంలో బులుసు వార్షిక వేదసభ జరుగుతుందని నిర్వాహకుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి తెలిపారు. స్వాధ్యాయరత్న గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠీ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. వేద స్వస్తి, వేద విద్యార్థులకు, పండితులకు సత్కారాలు జరుగుతాయి.

సత్యసాయి సామూహిక భజన



భజనలో పాల్గొన్న సత్యసాయి భక్తులు

సీటీఆర్ఐ: భగవాన్ సత్యసాయిబాబాతో ఆత్మీయ సంబంధం పుర్వజన్మ సుకృతమని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. మల్లిన నగర్‌లోని ప్రసాద్, రత్న కమల.. సత్యసాయి భజన మందిరంలో సోమవారం సామూహిక భజన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శన, స్పర్శన, సంభాషణ భాగ్యాన్ని పొందిన వీఎస్ఆర్‌కే ప్రసాద్, రత్న కమల కుటుంబ సభ్యులు ధన్యజీవులన్నారు. బాబా శత జయంత్యుత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా భజన మందిరంలో ఏర్పాటు చేసిన షిర్డీ సాయి విగ్రహాన్ని, సత్యసాయిబాబా చిత్రపటాలను ఆవిష్కరించారు. ప్రముఖ గాయకుడు అక్కిరాజు శ్రీనివాస్ ఆలపించిన సత్యసాయి గానామృతం అలరించింది. కార్యక్రమంలో జిల్లా సేవాదల్ మహిళా సమన్వయకర్త బిక్కిన రామలక్ష్మి, విద్యా విభాగం సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు, జోనల్ కన్వీనర్లు విజయసాయి, త్రిమూర్తులు, ఆల్కాట్ మందిర అధ్యక్ష కార్యదర్శులు దండమూడి గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం మనందరి బాధ్యత

రాజమహేంద్రవరం సిటీ: మొక్కలను నాటి, పచ్చదనాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్, ఇన్‌చార్జి నగర కమిషనర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద జీటీ రోడ్డు స్థలంలో సోమవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చదనం పెరిగితే మానవాళి మనుగడ సాధ్యమవుతుందన్న విషయాన్ని బాధ్యతగల పౌరులందరూ గ్రహించాలన్నారు. చెట్ల పెంపకంతో కాలుష్యం తగ్గుతుందని, ప్రకృతి వైపరీత్యాలను నివారించవచ్చన్నారు. అన్ని రకాల రహదారులు, విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములు చేయాలన్నారు. అకిరా మియావాకి పద్ధతిపై దృష్టి సారించాలని, తద్వారా తక్కువ స్థలంలో దట్టమైన చిట్టడవిని సృష్టించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ శైలజావల్లి, ఈఈ మదర్సా అలీ, ఏడీహెచ్ స్వాతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐడీబీఐను బలహీనపరచొద్దు



నిరసనలో పాల్గొన్న కోదండరామ్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: లాభాల బాటలో నడుస్తూ, రూ.లక్షల కోట్ల రిజర్వులున్న ఐడీబీఐను డిజిన్వెస్ట్‌మెంట్ చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచించడం సరియైన విధానం కాదని ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం.కోదండరామ్ అన్నారు. ఈ మేరకు సోమవారం మోరంపూడి ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఎల్ఐసీ యూనియన్ అధ్యక్షుడు ఆర్‌జే మాథ్యూస్ ఆధ్వర్యంలో ఐడీబీఐ బ్యాంక్ ఉద్యోగుల, అధికారుల దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావ నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ దేశంలో 2,100 బ్యాంకు శాఖలతో, 4 లక్షల కోట్ల రిజర్వు నిధులతో ఐడీబీఐ పనిచేస్తుందన్నారు. 10 ఏళ్ల కిందట నష్టాల్లో ఉన్న ఐడీబీఐని ఎల్ఐసీ కొని, దానిని లాభాల బాటలోకి తీసుకొచ్చిందన్నారు. మూడు సంవత్సరాల్లో రూ.పది వేల కోట్ల లాభాలు సాధించిందన్నారు. ఇంత గొప్పగా పని చేస్తున్న ఆ బ్యాంకును డిజిన్వెస్ట్ చేయాలనుకోవటం ప్రజా, ఉద్యోగ వ్యతిరేకమన్నారు.అలాగే రీజినల్ రూరల్ బ్యాంకుల షేర్లు విక్రయించడానికి ఐపీఓ విడుదల చేయాలన్న ఆలోచనతో ప్రభుత్వం ఉందన్నారు. ఇది గ్రామీణ ప్రాంత ప్రజల పొదుపు, ఆకాంక్షలకు అనుగుణంగా లేదన్నారు. బీమా రంగంలో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించాలన్న నిర్ణయం దేశ ప్రజల పొదుపు రక్షణకు ఆశనిపాతం అన్నారు. కాగా.. నిరసనలో యూనియన్ నాయకులు సత్యదేవ, పీఎస్ఎన్ రాజు, జి.శ్రీనివాసరావు, వి.ఈశ్వరరావు, భరణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక డ్రైవ్

- మహిళల భద్రతకు చర్యలు
- ఎస్పీ నరసింహ కిశోర్



రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ అన్నారు. ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, 283 మందిపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ నెలాఖరు వరకు వివిధ అంశాలపై ఈ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగిస్తామని, ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడి పట్టుబడితే, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు తప్పనిసరి

వినాయక చవితి ఉత్సవాలను నిబంధనలు పాటిస్తూ, ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ సూచించారు. పోలీసుల సూచనలు పాటిస్తూ, ఇతరులకు ఇబ్బంది లేకుండా పండగ జరుపుకోవాలన్నారు. డీజేలు, పెద్ద శబ్దం వచ్చేలా సౌండ్‌బాక్సులు పెట్టవద్దన్నారు. దీనిపై జిల్లాలోని వినాయక మంటప కమిటీలతో సమావేశమై అవగాహన కల్పిస్తున్నారన్నారు.

గంజాయి నేరస్తులపై పీడీ యాక్టు

గంజాయి విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. దీనిపై ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని, నేరస్తులపై పీడీ యాక్ట్ మాదిరి ప్రత్యేక చట్టం అమలు చేస్తున్నామన్నారు. పోలీసుస్టేషన్లలో గంజాయి కేసుల్లో ఉన్న వారిని రప్పించి బైండోవర్ చేయడంతో పాటు నాలుగైదు కేసులు ఒకరిపైనే ఉన్నవారిని ఏడాది పాటు జైల్లో ఉండేలా ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. పోక్సో కేసుల్లో ఉన్నవారిపై ఎస్ఓఎస్ సెక్సువల్ అఫెండర్స్ షీట్‌ను తెరుస్తున్నామన్నారు. జిల్లాలో 300 నుంచి 400 షీట్లు ఓపెన్ చేసినట్లు తెలిపారు. బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, వినియోగం వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు అరికట్టేందుకు, నేరాల కట్టడికి డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా కొనసాగుతోందన్నారు.

మహాత్మాగాంధీ విగ్రహం ధ్వంసం



గాంధీజీ విగ్రహం వద్ద నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు మసీదువీధి చివరలో ఉన్న మహాత్మా గాంధీజీ విగ్రహాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి సిమెంటు ఇటుకతో కొట్టి ధ్వంసం చేశాడు. మాజీ ఉప సర్పంచ్ కామిని ప్రసాద్ చౌదరి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, ఎస్సై అంకారావు సోమవారం సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాంధీజీ విగ్రహానికి సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా ఆదివారం అర్ధరాత్రి 1.24 గంటల సమయంలో నల్లకారు నుంచి ఒక వ్యక్తి దిగి సిమెంటు ఇటుకతో గాంధీజీ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్టు గుర్తించారు. మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ కామిని ప్రసాద్ చౌదరి, జిల్లా టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పెనుమళ్ళ సురేష్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముద్దాల అను, కామిని భాస్కరరావు తదితరులు ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతూ నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి ఆవుపాలతో క్షీరాభిషేకం చేశారు.

సర్పంచ్‌గా పద్మావతి ప్రమాణ స్వీకారం



సర్పంచ్ పద్మావతితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

కడియం: మండలంలోని కడియపులంక సర్పంచ్‌గా మారిశెట్టి పద్మావతి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో ఆమెఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవానికి రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ ముఖ్యఅతిథిగా హాజరై.. పద్మావతితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వైస్ ఎంపీపీ పంతం గణపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోడపాటి గోపి, మాజీ సర్పంచ్ గట్టి నరసయ్య, ఐఎన్ఏ మాజీ అధ్యక్షులు పల్లా సుబ్రహ్మణ్యం, బీజేపీ మండల అధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఓటింగ్ ప్రక్రియలో అసమానతలు

రాజమహేంద్రవరం సిటీ: ఓటింగ్ ప్రక్రియలో గుర్తించబడిన అనేక అసమానతలు ఆందోళన కలిగిస్తున్నాయని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఇటీవల జరిగిన పార్లమెంటరీ ఎన్నికలలో ఎన్నికల సంఘం తీరులో స్పష్టమైన పక్షపాతం కనిపించిందన్న బలమైన ఆరోపణలు వినిపించిన సందర్భంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజకీయ పార్టీలన్నీ రాహుల్ గాంధీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈవీఎంల భద్రతపై కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. మెషీన్‌లో నమోదైన ఓట్లకు, కేంద్రాల వద్ద లెక్కించిన ఓట్లకు మధ్య ఉన్న తేడా, ప్రత్యేకించి, ఓటర్ల జాబితాలో అనేక తప్పిదాలు, దౌర్జన్యంగా ఓటర్లు తొలగించబడ్డ ఘటనలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నకిలీ ఓట్ల నమోదు కూడా ఈ ఎన్నికల నైతికతపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తున్నాయన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడి



స్వాధీనం చేసుకున్న సారా, డ్రమ్ములతో ఎక్సైజ్ సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య ఆధ్వర్యంలో ఎక్సైజ్ సిబ్బంది సోమవారం వెంకట నగరం గ్రామ పరిధిలోని రివ్వలగడ్డ లంకల్లో దాడి చేశారు. ఈ సందర్భంగా 4200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 280 లీటర్ల సారా, 100 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిపై నార్త్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎక్సైజ్ అధికారి లావణ్య తెలిపారు. దాడిలో ఏఈఎస్ నాగ రాహుల్, ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ పులి హనుశ్రీ, నార్త్‌స్టేషన్ ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.